# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 28 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## 11 రోజులు..12 బిల్లులు

● తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. మొత్తం 11 రోజుల పాటు శాసన సభ సమావేశాలు సాగాయి. మొత్తం 97 గంటల 32 నిమిషాల పాటు శాసన సభ కొనసాగింది. ఈ 11 రోజుల్లో 12 బిల్లులను ప్రవేశ పెట్టి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శాసన సభ వ్యవహారాల శాఖ వివరించింది. ఇక తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా పడింది.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

- డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలు హక్కులు కోల్పోతాయి
- జనాభా ప్రాతిపాదికన కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని డీలిమిటేషన్ చేయాలి
- అన్ని పార్టీలు కలిసి డీలిమిటేషన్ పై కేంద్రంతో ఫైట్ చేద్దాం
- రాష్ట్రాలకు అంతరం రావొద్దనే మాజీ ప్రధాని ఇందిర రాజ్యాంగ సవరణ చేశారు
- తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి
- జనాభా నియంత్రణ దక్షిణాదికి శాపం కాకుడదు
- ప్రస్తుత జనాభా ప్రతిపాదికన ఎస్సీ,ఎస్టీ సీట్లు పెంచాలి
- లోక్ సభలో సౌత్ ప్రాతినిధ్యం 24 శాతమే డీలిమిటేషన్ తో సౌత్ రాష్ట్రాల ప్రాతినిధ్యం 19 శాతానికి చేరుతుంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం పెట్టిన సీఎం రేవంత్..



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించబోయే విధి విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో పారదర్శకమైన సంప్రదింపులు జరపకుండా చేస్తున్న కసరత్తు పట్ల తెలంగాణ శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో లోక్‌సభ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించడంతో పాటు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రస్తుత సరిహద్దులను మార్పు చేయాలని కోరుతూ సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది.

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన కసరత్తు పారదర్శకంగా ఉండాలని, అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపాలని తీర్మానంలో కోరారు. పునర్విభజనకు ప్రాతిపదిక విషయంలో రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకపోవడం, ప్రస్తుత కసరత్తు వల్ల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల నష్టం వాటిల్లుతుంది.

కేంద్ర ప్రభుత్వానికి తమ అభిమతాన్ని తెలియజేయాలన్న ఉద్దేశంతో శాసనసభ తీర్మానం ప్రతిపాదించినట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సభ ముందు వివరించారు. తీర్మానాన్ని ముఖ్యమంత్రి సభలో ప్రవేశపెడుతూ.. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించబోయే విధివిధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో పారదర్శకమైన సంప్రదింపులు లేకుండాజరుగుతున్న కసరత్తుపై ఈ సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాలతో విస్తృతమైన సంప్రదింపుల తర్వాత పునర్విభజన కసరత్తును పారదర్శకంగా చేపట్టాలని సభ కోరుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు పునర్విభజన శాపంగా మారకూడదు. జాతీయ జనాభా స్థిరీకరణ ఉద్దేశ్యంతో చేపట్టిన 42, 84 మరియు 87వ రాజ్యాంగ సవరణల లక్ష్యాలు ఇంకా నెరవేరలేదనే చెప్పుకోవాలి. జనాభా నియంత్రణ అమలు చేయటం ద్వారా జనాభా వాటా తగ్గిన మిగితా 2వ పేజీలో

## అవయవ దానం బిల్లుకు ఆమోదం

- బిల్లును ప్రవేశపెట్టిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- బిల్లుకు మద్దతు తెలిపిన కేటీఆర్, హరీష్ రావు
- నేను అవయవ దానానికి సిద్ధం : కేటీఆర్
- టాన్స్ ప్లాంటేషన్‌ను ఆరోగ్య శ్రీలో చేర్చాలని హరీష్ సూచన



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా చివరి రోజు గురువారం అవయవ దానం బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతితో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అవయవ దానం బిల్లుకు బీఆర్ఎస్ తరఫున తాము సంపూర్ణ మద్దతును ఇస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా జీవన్‌దాన్ ద్వారా 3,724 మంది బాధితులు ఆర్గాన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవయవ దానానికి అందరినీ ప్రోత్సహించే బాధ్యత ప్రజాపతినిధులుగా అందరిపై ఉందని అన్నారు.

అవయ దానానికి తాను సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అవయవ దానానికి ముందుకు వచ్చారు. ప్రజాప్రతినిధులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. నియోజకవర్గాల్లోనూ అవయవదానంపై చైతన్యం తేవాలని చెప్పారు. ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని... నియోజకవర్గాల్లో అవయవదానంపై చైతన్యం తీసుకురావాలని కేటీఆర్ అన్నారు. అవయవదానానికి సభ్యులు ముందుకు వస్తే అసెంబ్లీలోనే సంతకాలు చేద్దామని అన్నారు. తొలి సంతకం తానే చేస్తానని చెప్పారు. అవయవదానం ఎంతో గొప్ప మానవీయ చర్య అని... ఇది మరికొందరికి జీవితాన్ని ప్రసాదిస్తుందని అన్నారు.

అవయవదానంపై అసెంబ్లీలో బిల్లు సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కూడా మాట్లాడారు. అవయవాల మార్పిడి దందా ముఠాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా హరీశ్‌రావు కోరారు. అవయవదానం చేసిన వ్యక్తికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్గాన్ డొనేషన్ చేసిన వ్యక్తి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు అతడి పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇవ్వాలన్నారు. అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య బీమా లాంటివి కల్పించినట్లయితే మరింత ప్రోత్సహించినట్లవుతుందని హరీశ్ అభిప్రాయపడ్డారు.

## వచ్చే డిసెంబర్‌లోగా 'దేవాదుల' పూర్తి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వచ్చే డిసెంబర్‌లోగా దేవాదుల ప్రాజెక్టు అన్ని దశలు, పంపింగ్‌స్టేషన్లు పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం హన్మకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌజ్‌ను సందర్శించి 'దేవాదుల' మూడో దశ మూడో ప్యాకేజీలోని ఒక్క మోటర్‌ను ఆన్‌చేశారు. ఈ మోటర్‌తో 600 క్యూసెక్కుల నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. ధర్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి మోటర్ ద్వారా వస్తున్న గోదావరి జలాలను తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మరో 15 రోజుల్లో దేవన్నపేటలోని రెండో మోటర్‌ను కూడా ప్రారంభించి ధర్మసాగర్‌కు గోదావరి జలాలను తరలించనున్నట్టు చెప్పారు. రాజవరంలోని పంపింగ్ స్టేషన్‌ను సైతం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు సాగునీరందిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టుతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్టు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టును మళ్లీ ఇందిరమ్మ ప్రభుత్వంలోనే ఇప్పుడు సాగునీరందిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత పదేండ్లలో నాటి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఆగిపోయిన ప్రాజెక్టు పనులను మళ్లీ ప్రారంభించి ఆలస్యమైనా సాగునీరందించి పంటలను కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు కెఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఝాన్సీరెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నీటిపారుదల శాఖ సిఇ అశోక్, ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఇఇ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## సీఎంవి కక్ష సాధింపు చర్యలు

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"పాలనంటే పంచ్ డైలాగులు చెప్పడం కాదు. రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగితే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటా. ఎవరు ఏమనుకున్నా.... తెలంగాణ జాతిపిత కచ్చితంగా కేసీఆరే.. బూతుపిత మాత్రం రేవంత్‌రెడ్డే. ముఖ్యమంత్రికి ఎవరో ఏకే47 గురించి చెప్పారు. ఎవరో కాల్చి చంపారంట? ఏకే47తోపాటు తుపాకుల గురించి ఆయనకు తెలిసినంత మాకు తెలియదు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల మీదకు తుపాకి తీసుకుపోయిన రైఫిల్ రెడ్డి ఆయన. అసలు ఎవరు ఎవర్ని చంపి అధికారం లాక్కున్నారు..? పాపం పాత కాంగ్రెసోళ్లను అందర్నీ ఖతం చేసి వాళ్ల పదవిని లాక్కున్న రేవంత్ ఇవాళ మమల్ని అంటే ఎలా..?' అని బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా గురువారం అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ... అట్టర్ ప్లాప్ సినిమాకు అట్టహాసంగా శత దినోత్సవం చేసినట్లు కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు నిర్వహించారంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ మిగితా 2వ పేజీలో

## 'కక్ష పూరిత రాజకీయాలు మా విధానం కాదు..

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

'కక్ష పూరిత రాజకీయాలు మా విధానం కాదు..మేం అలా చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారు.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. నా బిడ్డ పెండ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. కేసీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్ఎస్ నేతల మాదిరిగా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపే వ్యక్తిని కాదు నేను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'రాజకీయ కక్ష సాధింపు ఎవరిది? మీదా? నాదా?.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎంపీగా ఉన్న నన్ను చర్లపల్లి జైల్లో ఉంచి చిత్రహింసలకు గురి చేశారు. నక్సలైట్లు, దేశ ద్రోహులు ఉండే డిటెన్షన్ సెల్‌లో పార్లమెంట్ సభ్యుడినైన నన్ను వేశారు. నేను పడుకోకుండా రాత్రిళ్లు లైట్లు వేశారు. జైల్లో 16 రోజులు నిద్రలేని రాత్రులు గడిపా. నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినా నేను కేసీఆర్ కుటుంబంపై ఏనాడూ.. ఎలాంటి రాజకీయ కక్ష చర్యలకు పాల్పడలేదు. వారిని జైలుకు పంపుతానన్న హామీని కూడా నెరవేర్చలేదు. ఎవరివి మిగితా 2వ పేజీలో

## డీప్ ఫేక్ వీడియోలపై పార్లమెంటులో మాట్లాడిన హేమమాలిని

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

డీప్ ఫేక్ సాంకేతికతను దుర్వినియోగం చేయడం పట్ల ప్రముఖ నటీమణి, బీజేపీ ఎంపీ హేమమాలిని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో డీప్ ఫేక్ వీడియోలు సర్క్యులేట్ అవుతుండడం పట్ల ఆమె పార్లమెంటులో గళం విప్పారు. ఈ అంశంపై లోక్‌సభలో ఆమె మాట్లాడుతూ, డీప్‌ఫేక్ టెక్నాలజీ సెలబ్రిటీల ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా వారి మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కృత్రిమ మేధస్సు, డీప్‌ఫేక్ టెక్నాలజీ ప్రపంచాన్ని వేగంగా చుట్టేస్తున్న ఈ సమయంలో, దీని దుర్వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని హేమమాలిని సూచించారు.

## ఇమ్మిగ్రేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

- చొరబాటుదారులకు భారత్ ధర్మసత్రం కాదు
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు 2025ను లోక్‌సభ గురువారం ఆమోదించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడారు. పర్యాటకులు లేదా విద్య, వైద్యం, వ్యాపారం కోసం భారత దేశానికి రావాలనుకునే వారిని స్వాగతించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చొరబాటుదారులకు భారత్ ధర్మసత్రం కాదన్నారు. దేశానికి ముప్పు కలిగించే వారిపై తీవ్రంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కాగా, మయన్మార్, బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలు భారత్‌లోకి అక్రమంగా చొరబడుతున్నారని అమిత్ షా గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చొరబాట్లను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. దీంతో వ్యక్తిగత ప్రయోజనాల కోసం దేశంలో ఆశ్రయం పొందుతున్న వ్యక్తులు పెరిగిపోయారని అన్నారు. దేశ భద్రతకు వారు ముప్పుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో అశాంతి సృష్టించే చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు భారతదేశాన్ని సందర్శించే ప్రతి విదేశీయుడి గురించి దేశానికి తాజా సమాచారం అందేలా ఇమ్మిగ్రేషన్ బిల్లు నిర్ధారిస్తుందని అమిత్ షా తెలిపారు. తమ దేశం ధర్మశాల కాదన్న ఆయన, దేశాభివృద్ధికి సహకరించేందుకు ఎవరైనా భారత్‌కు వస్తే వారికి స్వాగతం పలుకుతామని అన్నారు. ప్రతిపాదిత చట్టం దేశ భద్రతను పటిష్టం చేస్తుందని తెలిపారు. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థ, వ్యాపారాన్ని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యం, విద్య రంగాలను ప్రోత్సహిస్తుందని అమిత్ షా వివరించారు.

## హైచ్‌సీయూ భూముల వేలం ప్రక్రియను విరమించుకోండి

● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆదాయం కోసం గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి వేలం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ భూముల వేలంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీఎంకు రాసిన లేఖలో హైచ్‌సీయూలో ఉన్న 400ఎకరాల భూమి వేలం ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. అలాగే గతంలో ప్రభుత్వ భూముల అమ్మకాలను వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం వేలానికి నోటిఫికేషన్ ఇచ్చిన భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉంది. అది పూర్తిగా అటవీ సంపద, జింకలు, నెమళ్లు, వేలాది పక్షులు ఉన్నాయని వాటిని పరిరక్షించే అవసరం ఉందని, యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. ఇదే క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## భద్రాచలంలో భవనం కూలి ఇద్దరు మృతి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

భద్రాచలం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం కూలిన ఘటనలో శిథిలాల కింద ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పోలీసులు, రెస్క్యూ టీమ్ బుధవారం అర్ధరాత్రి నుంచి సహాయకచర్యలు చేపట్టారు. సిబ్బంది 8 గంటలు శ్రమించి ఎట్టకేలకు ఒకరిని సజీవంగా బయటకు తీసుకొచ్చారు. కానీ అతని ప్రాణాలు మాత్రం కాపాడలేకపోయారు. బయటకు వచ్చిన 10 నిమిషాల్లో మృతి చెందారు. శిథిలాల కింద ఉన్న మరొకరు మృతి చెందినట్టు అధికారులు నిర్ధారించారు. భద్రాచలం పట్టణానికి చెందిన చల్లా కామేష్(45), ఉపేంద్ర(47) ఇద్దరూ తాపీ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పనిలో భాగంగా పట్టణానికి చెందిన శ్రీపతి ఆరంతస్తుల భవనంలో ఏడాది కాలంగా సిమెంట్ పని చేస్తున్నారు. బుధవారం కూడా మధ్యాహ్నం వరకు పని చేశారు. అనంతరం ఆరో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి భోజనం చేసి కాసేపు సేదతీరుతుండగా ఒక్కసారిగా భవనం కూలింది. దాంతో ఇద్దరూ శిథిలాల కింద చిక్కుకున్నారు. బుధవారం రాత్రి చల్లా కామేష్ ఆర్తనాదాలు పోలీసులకు వినిపించాయి. అప్రమత్తమైన రెస్క్యూ టీమ్ సభ్యులు బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు అతన్ని బయటికి తీయగా.. 10 నిమిషాల్లోనే ప్రాణాలొదిరారు. మరో కార్మికుడు ఉపేంద్ర(47) మృతదేహం శిథిలాలు తొలగించే క్రమంలో గురువారం సాయంత్రం వెలికితీశారు.

## పాకిస్థాన్ కారాగారంలో భారత మత్స్యకారుడి మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పాకిస్థాన్ కరాచీలోని మలిర్ జైలులో 52 ఏళ్ల భారత మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నాడని జైలు అధికారులు గురువారం తెలిపారు. 'భారతీయ ఖైదీలు ఉండే బ్యారక్‌లోని వాష్‌రూమ్‌లో మంగళవారం రాత్రి గౌరవ్ రామ్ ఆనంద్ ఓ తాడుతో ఉరివేసుకున్నాడు' అని జైలు సూపరింటెండెంట్ అర్షద్ హుసైన్ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. అతడు మంగళవారం రాత్రి 2.30 గంటలకు చనిపోయినట్లు కారాగార డాక్టర్లు ప్రకటించారని జైల్ సూపరింటెండెంట్ వివరించారు. కాగా అతడి భౌతిక కాయాన్ని ఈది ట్రస్ట్ మార్చురీకి తరలించినట్లు, మిగతా ఫార్మాలిటీస్ జరుగుతున్నాయని అర్షద్ తెలిపారు. పాకిస్థాన్ జలాల్లో చేపలు పడుతున్నందుకు 2022 ఫిబ్రవరిలో పట్టుకున్నారు. అప్పటి నుంచి అతడు పాక్ జైలులోనే మగ్గుతున్నాడు. పాకిస్థాన్ జైలుల్లో మగ్గుతున్న చాలా మంది భారతీయ మత్స్యకారుల్లో ఎక్కువ వరకు గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ ప్రాంతానికి చెందిన వారే ఉన్నారని అర్షద్ హైసైన్ వివరించారు. పాకిస్థాన్‌లో మగ్గుతున్న చాలా మంది భారతీయులు మనోవ్యథ, ఆదుర్దాతో ఉన్నారని ఈది ఫౌండేషన్‌కు చెందిన అధికారి ఒకరు తెలిపారు.

## ఏసీబీ వలలో జీడిమెట్ల ట్రాన్స్‌కో ఏఈ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఏసీబీ అధికారులు దాడుల్లో మరో విద్యుత్ శాఖ అవినీతి అధికారి కటకటాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే జీడిమెట్ల డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ ఎస్ సురేందర్ రెడ్డి దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్‌లో పని చేస్తున్నాడు. దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బౌరంపేటకు చెందిన ఓ వ్యక్తి కి సంబంధించిన 11 కెవి లైన్ షిఫ్టింగ్ కోసం ఎస్టిమేషన్ వేసేందుకు 30 వేలు రూపాయల లంచం ఆశించడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదుతో గురువారం 2:45 నిమిషాలకు అవినీతి నిరోధక శాఖ సిటీ రేంజ్ యూనిట్-2 డిఎస్పి పి.శ్రీధర్ నేతృత్వంలో డి.పోచంపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బాధితుని దగ్గర నుండి 30 వేలు ఏఈ లంచం తీసుకొని ప్యాంట్ జేబులో పెట్టుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సదరు ఏఈ సురేందర్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. అతనిని అరెస్ట్ చేసిన అధికారులు విచారణ నిమిత్తం నాంపల్లి ఎసిబి కోర్టుకు తరలించారు.



## పదవీ కాలం పూర్తి చేసుకున్న సభ్యులకు సత్కారం

**బలగం టీవి, హైదరాబాద్**

శాసనమండలిలో పదవీ కాలం పూర్తి చేసుకున్న సభ్యులను ఘనంగా సత్కరించారు. శాసనమండలి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పదవీ కాలం పూర్తి చేసుకున్న తొమ్మిది మంది సభ్యులను సత్కరించారు. మార్చి 29వ తేదీతో పదవీ కాలం ముగుస్తున్న టీ.జీవన్ రెడ్డి గారు, కూర రఘోత్తమ రెడ్డి , అలుగుబెల్లి నర్సిరెడ్డి గారు, మహమూద్ అలీ గారు, సత్యవతి రాథోడ్ , శేరి సుభాష్ రెడ్డి , యెగ్గె మల్లేశం , మిర్జా రియాజుల్ హుస్సేన్ ఎఫెండీతో పాటు మే 1 వ తేదీతో పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న ఎంఎస్ ప్రభాకర్ రావుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ గారు, మంత్రులు డి. శ్రీధర్ బాబు గారు, దామోదర రాజనర్సింహ గారు, పలువురు శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



**బంజారాలు, లంబాడాల మాతృభాష "గోర్‌బోలి" ని రాజ్యాంగంలోని 8 వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభలో తీర్మానం ఆమోదింపజేసినందుకు పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన ఎమ్మెల్యేలు బాలూ నాయక్ గారు, రాంచంద్రు నాయక్ , రాందాస్ నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని శాసనసభ చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. లంబాడా, బంజారాల చిరకాల ఆకాంక్ష అయిన "గోర్‌బోలి" భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.**

## సీఎంవి కక్ష సాధింపు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

తన ఏడాది పాలనలో ఆరు గ్యారెంటీలు, తులం బంగారం, రుణమాఫీ, రైతుబంధు పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. కొండారెడ్డి పల్లి నుంచి కొడంగల్ దాకా ఏ ఒక్క ఊర్లోనైనా 100శాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'ఇంత ఫ్రస్టేషన్, ఆవేశం, వ్యక్తిగత విమర్శలు, తిట్ల దండకం అందుకున్న సీఎంను నా జీవితంలో చూడలేదు. మీవల్ల రాబోయే 20 ఏండ్లు కాంగ్రెస్‌కు ఓటేయ్యాలంటే ఎవరైనా భయపడే పరిస్థితి తెలంగాణ మొత్తంలో వస్తున్నది. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానాలో ఎన్నికల ప్రచారం చేశారు. అద్భుతాలు సాధించారు. 'ఓ స్త్రీ రేపు రా' మాదిరి కాంగ్రెస్ పాలన ఉంది. ముఖ్యమంత్రిలో ఒక అపరిచితుడు ఉన్నాడు. మొన్న రవీంద్ర భారతిలో మాట్లాడుతూ.. మమ్మల్ని ఎవరూ నమ్మటం లేదు.. మనకు అప్పు పుడతలేదు.. దివాళ తీసినం.. అని మాట్లాడిండు. ఇక్కడేమో రూ. లక్షా 58 వేల కోట్ల అప్పు చేశానని రొమ్ము విరుచుకుని చెబుతున్నారు.. ఆయన కరెక్టా.. ఈయన కరెక్టా.. రామునా.. రెమోనా.. ఎవరు కరెక్టో తెలుస్తలేదు" అని కేటీఆర్, సీఎంపై సెటైర్లు విసిరారు. తెల్లారి లేస్తే ప్రజాపాలన అంటారు, కానీ నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. మీ ప్రజా పాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా అంతే ఉందని విమర్శించారు. హరీశ్‌రావు మీద పెట్రోల్ పోసి చంపేస్తానని ఓ కాంగ్రెస్ నాయకుడు అంటే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. చిన్న మాటంటే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయలేక అడ్డగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## రూ.1100 కోట్ల ఆదాయం వచ్చే ముచ్చట చెబుతున్నా..

### మాజీ మంత్రి మల్లారెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

జీరో అవర్‌లో తనకు అవకాశం రాగానే బీఆర్ఎస్ సభ్యులు, మాజీ మంత్రి మల్లారెడ్డి లేచి..'అధ్యక్షా నేను రెండు ముచ్చట్లు చెబుతా..ముందు ప్రభుత్వానికి రూ.1100 కోట్ల ఆదాయం వచ్చేది ముందు చెప్పనా? నా నియోజకవర్గ సమస్య ముందుచెప్పానా?' స్పీకర్‌ను అడగటంతో సభ్యులందరూ నవ్వారు. తన నియోజకవర్గంలో 13 మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని కోరారు. 'అధ్యక్షా..ఇగ రూ.1100 కోట్ల ఆదాయం వచ్చే ముచ్చట చెబుతున్నా...'అంటుండగానే 'ఎవ్వరైనా ఒకటే ప్రశ్నకు పరిమితం కావాలని చెప్పా' అంటూ స్పీకర్ మైక్ కట్ చేశారు. 'అరె సర్కార్‌కు ఆదాయం వచ్చే ముచ్చట చెబుతా అంటుంటే...' అని అలాగే మాట్లాడుతుండటంతో కేటీఆర్ వారించి కూర్చోమన్నారు.

## కాగ్ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం

**బలగం టీవి, హైదరాబాద్**

2023-24 ఆర్థిక ఏడాదికి సంబంధించిన ఫైనాన్స్ అకౌంట్స్, అప్రాప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదికను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని తెలిపారు. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతంగా పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చయిందని తెలిపారు. ప్రభుత్వం అదనంగా రూ.1,11,477 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా ప్రభుత్వం రూ.10,156 కోట్లు తీసుకున్నదని, రూ.35,425 కోట్ల ఓవర్ డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకున్నదని తెలిపారు.

2023-24లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం

వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు

ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు



2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్ల మొత్తం రూ.9934 కోట్లు

రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు

రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు, రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు శాతం 3.33

2023-24 ఆర్థిక ఏడాది ముగిసే వరకు రుణాల మొత్తం 4,03,664 కోట్లు

2023-24 ముగిసే నాటికి జీఎస్డీపీలో అప్పులు 27 శాతం

2023-24 వరకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు

2023-24లో మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు

స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు

స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 11 శాతం పెరుగుదల

## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలు నష్టపోకూడదు. అందుకే, నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. పార్లమెంట్ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్న నియోజకవర్గాల సరిహద్దుల మార్పులు చేర్పులు చేయాలి. తాజా జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. అంతే కాకుండా, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, తాజా జనాభా లెక్కల ప్రకారం మరియు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో నిర్దేశించిన మేరకు ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలను 153 వరకు తక్షణమే పెంచాలని ఈ సభ తీర్మానిస్తుంది. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను ప్రవేశ పెట్టాలని ఈ సభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది అని ప్రతిపాదించారు.

ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని తమిళనాడు ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ రాష్ట్రాల సమావేశం ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పునర్విభజన కోసం గతంలో అనుసరించిన విధానాలను సభలో వివరించారు.

జనాభా ప్రాతిపదికన పుర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉన్న ప్రాతినిధ్యం 24 శాతం మేరకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలను 153 కు పెంచాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 లో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఆ చట్టంలో పేర్కొన్న విధంగా పునర్విభజన చేపట్టకపోవడాన్ని సభ ముందు వివరించారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన చేసిన తీరు, సిక్కింలో జరిగిన ప్రక్రియను తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిత పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం మంచిది కాదని, క్షేమకరం కాదని, అందుకే రాజకీయాలకు అతీతంగా ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్టు వివరించారు.

## 'కక్ష పూరిత రాజకీయాలు మా విధానం కాదు..

(మొదటి పేజీ తరువాయి)

కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోంది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అంటూ నిత్యం మాట్లాడుతూనే అయన కుర్చీ మీద కుటుంబ సభ్యులు కన్నేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పెద్దాయనను ఖతం చేసే స్కీం నడుస్తోంది నేపాల్ రాజు దేవేంద్ర అధికారం కోసం ఏకే 47 గన్‌తో ఎనిమిది మంది కుటుంబ సభ్యులను హతమార్చారు. అలాంటి పరిస్థితులు తెలంగాణలో ఉత్పన్నమవుతాయేమోనని భయంగా ఉంది. నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడితేనే జ్ఞానమా?" అంటూ బీఆర్ఎస్‌పైనా, కేటీఆర్‌పైనా రేవంత్ నిప్పులు చెరిగారు. రైతుల భూములను బలవంతంగా గుంజుకున్నది బీఆర్ఎస్ సర్కారేనని గుర్తు చేశారు. తాము మాత్రం భూ నిర్వాసితులకు దేశంలోనే అత్యుత్తమమైన ప్యాకేజీ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కమీషన్ల కోసం రూ.36 వేల కోట్ల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అంచనాలను రూ.1.50 లక్షల కోట్లకు పెంచారని విమర్శించారు. ప్రాజెక్టులు కట్టిన చోటల్లా కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలు ఫాంహౌస్‌లు, భూములు కొన్నారని ఆరోపించారు. ఈ విషయమై కాంగ్రెస్ సభ్యులు కాకుండా ఇతర పార్టీల వారితో నిజనిర్ధారణ కమిటీకి ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లు, ప్రాజెక్టుల నిర్మాణంలో వేల కోట్ల అవినీతి జరిగిందని విచారణ కమిషన్లు తేల్చాయని అన్నారు. ఆయా కేసుల్లో బాధ్యులు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

## "గోర్ బోలి' భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలి'

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

లంబాడాలకు చెందిన 'గోర్ బోలి' భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా పరిరక్షించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ భాషకు లిపి లేదనీ, ప్రజల్లో మాత్రం చెలామణి అవుతున్నదన్నారు. ఈమేరకు గురువారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలోని 11 రాష్ట్రా ల్లో ఈ భాష ఉనికి ఉందన్నారు. రాజస్థాన్‌లో సంప్రదాయబద్ధంగా గోర్‌బోలి భాషను ఆదరిస్తున్నారని గుర్తుచేశారు. లంబాడాలు తీజ్ పండుగను గొప్పగా జరుపుకుంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే సంత్ సేవాలాల్ జయంతి వేడు కలు అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ ప్రధాని నెహ్రూ చెప్పిన ట్టుగా భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమన్నారు. అది ఆయా భాషల్లోనూ కనిపిస్తుందని చెప్పారు. విద్యాసంస్థల్లోనూ ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత ప్రాచుర్యం కల్పించాలని అన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ...

- **ఎమ్మెల్యే వివేకానందా రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



బీజేపీ, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందా రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం అసెంబీ వేదికగా బయటపడిందన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బీజేపీ సభ్యులతో బీఆర్ఎస్ పార్టీపై దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే బీజేపీ సభ్యులు అసెంబ్లీలో చదువుతున్నారని, వీళ్ల మైత్రి బంధం ప్రజలు గమనిస్తు న్నారని తెలిపారు. కాళేశ్వరంకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందన్నారు. బీజేపీ నేతలుపైకి బీజేపీ నేతలే అయినా కాంగ్రెస్ సభ్యుల్లా ప్రవర్తి స్తున్నారని, అలాంటి వారు బీజేపీలో ఉండడం ఎందుకుని, కాంగ్రెస్‌ని విలీనం చేస్తే సరిపోతుందని ఎద్దేవా చేశారు. అబద్దాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గడిచిన 16 నెలలుగా ఉద్యోగస్తులను అవమానిస్తూ వస్తోందన్నారు. పెండింగ్ డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఘనపూర్ ఆసుపత్రి కి చెందిన వైద్య బృందం డా.సంధ్య ఆధ్వర్యంలో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న సేవలను, ఆసుపత్రి పరిశుభ్రతను గురించి తెలుసుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందుతూ వస్తున్నది. ఈ సారి కూడా అదే స్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డా.పెంచలయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇతర వైద్యులు డా. రవీందర్,డా.అనిల్,డా.చారి,డా. సుభాషిణి, నర్సింగ్ సూపెరిండెంట్లు అంజమ్మ, సుందరి, విజయ లక్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ, తదితరలు సిబ్బంది పాల్గొన్నారు.



## దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది, తెలంగాణకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రశ్నించే హక్కునిచ్చి అధికారులకు,నాయకులకు పని చేసే బాధ్యతను గుర్తుచేసేది రాజ్యాంగమని, రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలనే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీఆర్ఎస్ పార్టీతో మన పార్టీని కాంగ్రెస్ నాయకులు పోల్చవద్దని, ప్రజలను వాళ్ళు దోచుకున్నరని, మనం ప్రజలకు పంచిపెట్టినమని కష్టపడ్డ నేతలందరినీ పార్టీ విస్మరించదని అందరికీ సముచిత స్థానం కల్పిస్తదని అన్నారు.

తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశనికి హాజరై సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, దేశానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యం కావాలని చెప్పి సమరంలో అహింస మార్గంలో సమరం చేసిన వ్యక్తి బాపు అని, దళిత బడుగు బలహీన వర్గాల కోసం సమాన హక్కుల కోసం రాజ్యాంగమని ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగమేనని,75 సంవత్సరాలు అనేక పార్టీలు దేశాన్ని పాలిస్తే సింహ భాగం కాంగ్రెస్ పార్టీ పాలించిందని అన్నారు. అందులో ఎవరు కూడా రాజ్యాంగాన్ని ముట్టుకొనే ప్రయత్నం చేయలేదని అన్నారు. కానీ ఎవరికి రాని దురాలోచన బిజేపికి వచ్చిందని బీజేపీ పార్టీకి బాధ్యత లేదని ఎందుకు కంటే ఎందులో బాగసౌమ్యం కాలేదని బీజేపి పార్టీ రాజ్యాంగన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తుందని అన్నారు. రాజ్యాంగం పట్ల కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందని బీజేపీ కుట్రలు పసిగట్టి భారత్ జోడొ యాత్ర చేపట్టిన నాయకుడు రాహుల్ గాంధీ అని, దేశ ప్రజలను ఏకం చేయడానికి భారత్ జోడో యాత్రను చేపట్టి ప్రజల్లో చైతన్యం తెచ్చారు అని, అప్ కీ బార్ 400 సిట్ అనే నినాదం తో ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ పార్టీ రాజ్యాంగం మార్చే కుట్రలు చేసిందని అన్నారు.

రాజ్యాంగ రచించిన అంబేద్కర్ పై అనాలోచితంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా చివరికి దేశ ప్రజల ముందు తలవంచక తప్పలేదని అది రాజ్యాంగం గొప్పతనం రాజ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ నాయకులపై ఉంది. దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చింది..తెలంగాణ ఇచ్చి స్వేచ్ఛ స్వాతంత్ర్యం ఇచ్చింది సోనియా గాంధీ మాట ఇచ్చి మడమాతిప్పకుండ తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియా గాంధీది, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని ఇనుమ గోడలను విరగొట్టి..ప్రజాపాలన అందిస్తున్నమని అన్నారు. మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపించాడు సీఎం రేవంత్ రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా కూడా అన్ని ఆరు గ్యారంటిలను అమలు చేసే దిశగా పని చేస్తున్నామని బీసీ కులగణన చేసి అన్ని వర్గాలకు న్యాయం చేసేలా చేసిండు అని,ఎన్నో యేండ్ల కల ఎస్సి వర్గీకరణ కు అసెంబ్లీలో బిల్లు ఆమోదింప జేసినమని తీర్మానాన్ని పార్లమెంట్ లో చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రంలో ఉన్న బీజేపీ దేనని,దేశ సమగ్రత, సౌరబౌమదికారన్ని కాపాడానికి ఇందూరగాది,రాజీవ్ గాంధీ ప్రాణాలు కోల్పోయారని స్వయం ఉపాధి కోసం రాజీవ్ వికాస్ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీనని, బీఆర్ఎస్ నాయకుల్లా దోచుకోలేదని ప్రజలకు పంచిపెట్టినమని, బీఆర్ఎస్ పార్టీ లీడర్ల లెక్క కాదు కాంగ్రెస్ పార్టీ అని, రాజ్యాన్ని విస్మరించే విధంగా కాంగ్రెస్ పార్టీ ,నాయకులు పనిచేయరని అన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్లో పెట్టవద్దు

- ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలు పెండింగ్లో పెట్టవద్దని ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ ఆదేశించారు. ప్రజా భవన్ప్ర జావాణి దరఖాస్తులు, ఎస్ బీఎఫ్ఎస్ తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజా భవన్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ మాట్లాడారు. ప్రజావాణి లో వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఒకే అర్జీని పట్టుకొని పదే పదే రాకుండా చూడాలని ఆదేశించారు. అర్హులైన వారి సమస్యలు తప్పకుండా పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఎస్ బీ ఎఫ్ ఎస్ పై ప్రచారం చేయాలని, అర్హులందరికీ సహాయం అందేలా చూడాలని తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీవో లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్.. ఎస్ఎస్సీ బోర్డు ముట్టడి



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో పదవ తరగతి ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో %బాజ% బోర్డు ముట్టడించిన బీఆర్ఎస్ నాయకులు. సీమాంధ్ర కార్పొరేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కై పదోతరగతి ప్రశ్నపత్రాలు అమ్ముకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాశాఖ తన ఉద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి పరీక్షలకు ముందు విద్యాశాఖ రివ్యూ నిర్వహించకుండా పరీక్షలు నిర్వహించడం వల్లే నకిరేకల్, మంచిర్యాల, వికారాబాద్, జుక్కల్ లో పేపర్ లీకు జరిగింది అన్నారు. “పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ బాధ్యుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు నాలుగు పరీక్షలు నిర్వహిస్తే నాలుగు ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడం చూస్తుంటే విద్యాశాఖ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుంది. కార్పొరేట్ పాఠశాలలతో కుమ్మక్కై కాంగ్రెస్ ఎమ్మెల్యేలే లీకులకు పాల్పడటం సిగ్గుచేటు, పరీక్షలు సరిగ్గా నిర్వహించమని కోరితే రేవంత్ రెడ్డి డైరెక్షన్లో కేటీఆర్ పై నకిరేకల్ లో అక్రమకేసు పెట్టారు. ముఖ్యమంత్రి పేషి నుండి ఆర్డర్ రాగానే సెకండ్లలో కేసులు నమోదు చేస్తున్నారు.. పేపర్ లీకేజీ కేసులో అసలు నిందితులను తప్పించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి చిల్లర వేషాలు మానుకోవాలి పోలీసులు చట్ట ప్రకారం నడుకుంటే మంచిది. పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం మేము న్యాయ పరంగా కొట్లాడుతాం,ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి. మేము అధికారంలోకి వచ్చాక అన్ని తెలుస్తాం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తుంగ బాలు, కడారి స్వామి యాదవ్, చటారి దశరథ్, కాటం శివ, నర్సింగ్,శ్రీను నాయక్, మిద్దె సురేష్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేందర్ రావు, కల్వ నితీష్, సాయి గౌడ్, రాకేష్, రెహమాత్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ పరిరక్షణ పై ప్రత్యేక సమావేశం..



**వేములవాడ పట్టణంలో పట్టణ, అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సూచన మేరకు గురువారం వేములవాడ పట్టణంలో జై బాబు జై భీమ్ జై సన్విధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి ఎండి అవేజ్, పట్టణ కోఆర్డినేటర్ చంద్రకళ అర్బన్ కోఆర్డినేటర్ దొబ్బేటి నరసయ్య పాల్గొని, వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చినప్పటి నుండి తాము చేసిన సంక్షేమ పథకాలను ఈనెల 29న నిర్వహించే పాదయాత్ర కోసం వేములవాడ పట్టణంలో అన్ని వార్డులను కలుపుకొని రోడ్డు మ్యాపును తయారు చేయాలని వారు సూచించారు. ఆ కార్యక్రమంలో గత ప్రభుత్వ వైఫల్యం ఎండ కడుతూ ప్రజలకు వివరించాలని సూచించారు. బిజెపి సొత్తు కాదని రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరి పరీక్షించాలని రాష్ట్ర ప్రతినిధి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, అర్బన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పిల్లి కనకయ్య, సాగరం వెంకటస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు వస్తారు కృష్ణ, విద్యాసాగర్, కత్తి కనకయ్య, నాయకులు కూరగాయల కొమరయ్య, పులి రాంబాబు గౌడ్, తోటరాజు, పీర్ మహమ్మద్, తుమ్ మధు, స్వామి, ఎర్రం ఆగయ్య, నాగుల రాము, అన్నారం శ్రీనివాస్, సల్మాన్ రెడ్డి, కొండా శేఖర్, అంబాటి చందు, అరుణ్ తేజా చారి, ఈన్నారం సాగర్, దూలం భూమేష్, గుర్రం తిరుపతి, లింగంపల్లి కిరణ్, అక్కన పెళ్ళి నరేష్, కుతడి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## అంజన్న హుండీ లెక్కింపు సేవలో పాల్గొన్న నీలోజిపల్లి కొత్తపేట గ్రామస్తులు

- సేవకు రావడం అదృష్టంగా భావిస్తున్నాం : గ్రామస్తులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి, కొత్తపేట గ్రామానికి చెందిన గ్రామస్తులు మల్యాల మండలం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం రోజున సేవా సమితితో పాటు హుండీ లెక్కింపు సందర్భంగా సేవలు అందించారు. వారు మాట్లాడుతూ: స్వామివారి సేవకు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. సేవ సమితి కార్యక్రమంలో కదిరే నాగరాజు, ఎర్ర శ్రీనివాస్, ఎర్ర రాజు, జక్కని నాగభూషణ్, ఎర్ర రాములు, గోనే అనిల్, ఎర్ర అశోక్, ఆవుల లక్ష్మణ్, మధు, కొత్తపేట బాలయ్య లు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌కు షాక్..!

- 5 వికెట్ల తేడాతో లక్నో గెలుపు
- 192 పరుగుల లక్ష్యాన్ని 16.1 ఓవర్లలోనే ఛేదించిన లక్నో



**బలగం టీవీ, హైదరాబాద్**

తొలి మ్యాచ్‌లోనే రికార్డు స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్ తగిలింది. రెండో మ్యాచ్ లో నిరాశపరిచారు. లక్నో సూపర్ జెయింట్స్ తో మ్యాచ్ లో సన్ రైజర్స్ 5 వికెట్ల తేడాతో ఓడింది. హైదరాబాద్ టీమ్ నిర్దేశించిన 192 పరుగుల విజయలక్ష్యాన్ని లక్నో సూపర్ జెయింట్స్ 16.1 ఓవర్లలో 5 వికెట్లకు ఛేదించింది.

ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన పోరులోతొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ 28 బంతుల్లో ఐదు ఫోర్లు, 3 సిక్సర్లతో 47 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నితీశ్ రెడ్డి (32), క్లాసెన్ (26), అంకిత్ వర్మ 13 బంతుల్లో ఐదు సిక్సర్లతో 36 పరుగులు చేశారు. మి డిల్ ఆర్డర్‌లో వచ్చిన అనికేత్ వర్మ (36బీ 13 బంతుల్లో) మెరుపులు మెరిపించాడు

తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లక్నో 16.1 ఓవర్లలోనే కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ మిఛెల్ మార్ష్, నికోలస్ పూరన్ అద్భుత బ్యాటింగ్‌తో లక్నోను గెలిపించారు. మార్ష్ 7 ఫోర్లు, రెండు సిక్స్‌లతో 52 పరుగులు చేశాడు. ఇక విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన పూరన్ ఆరు సిక్స్‌లు, మరో 6 ఫోర్లతో 26 బంతుల్లోనే 70 పరుగులు సాధించాడు. చివర్లో సమద్ 8 బంతుల్లోనే అజేయంగా 22 పరుగులు చేసి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. మ్యాచ్ విజయంలో శార్దూల్ ఠాకూర్ (4/34), నికోలస్ పూరన్ (70), మిచెల్ మార్ష్(52) కీలకంగా వ్యవహరించారు.






## ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు దివ్యాంగులకు ఉచిత పాస్‌లు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 22న ప్రారంభమైన ఐపీఎల్ 18వ సీజన్ క్రికెట్ అభిమానులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) దివ్యాంగుల విషయంలో తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే దివ్యాంగులకు ఉచితంగా ఐపీఎల్ పాస్‌లు జారీ చేస్తామని ప్రకటించింది.

ఈ టికెట్లు పొందాలనుకునే వారు తమ పేరు, కాంటాక్ట్ నంబర్, వ్యాలిడ్ డిసేబిలిటీ ప్రూఫ్, అవసరమైన మ్యాచ్ వివరాలను పంపించాల్సి ఉంటుంది. వివరాలు పంపించాల్సిన మెయిల్ ఐడీ–


pcipl18rgics@gmail.com. సీట్లు పరిమితంగా ఉన్నాయి. ముందు దరఖాస్తు చేసిన వారికి ప్రాధాన్యమిస్తారు. ఎంపికైన వారికి మెయిల్ ద్వారా సమాచారం అందించబడుతుంది.

# రామ్ చరణ్ కొత్త మూవీ ‘పెద్ది’




**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌సీ16. ఈ సినిమాకు ‘ఉప్పెన’ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా.. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది. బాలీవుడ్ నటుడు ‘మీర్జాపూర్’ వెబ్ సిరీస్‌లో మున్నాభాయ్యగా నటించిన దివ్యేందు శర్మ ఇందులో విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే గురువారం రామ్ చరణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు ‘పెద్ది’ అనే టైటిల్ పెట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. గుర్తింపు కోసం పోరాటం అంటూ ఈ ఫస్ట్ లుక్‌కి క్యాప్షన్ ఇచ్చారు మేకర్స్.




ఉత్తరాంధ్ర స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లో కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## గాయం నుంచి కోలుకోడానికి సమయం పడుతుంది

- రష్మిక మందన్న



**బలగం టీవీ, హైదరాబాద్**

రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా అభిమానులతో ముచ్చటించింది రష్మిక. అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపింది. అలాగే ఓ అభిమాని కాలికి తగిలిన గాయం గురించి అడగ్గా రష్మిక ఇలా సమాధానం ఇచ్చింది. కాలికి అయిన గాయం ఇప్పుడిప్పుడే నయమవుతోందని, కానీ, పూర్తిగా సెట్ కావాలంటే మరో 9 నెలల సమయం పడుతుందని తెలిపింది రష్మిక. కాగా నొప్పి ఉన్న కూడా సినిమాల్లో బిజీ అవ్వాలని ప్రయత్ని స్తున్నట్టు చెప్పుకొచ్చింది. ఇప్పుడు బెటర్ గానే ఉందని చెప్పుకొచ్చింది.

బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంది రష్మిక మందన్న . ఇటీవలే పుష్ప 2, ఛావ సినిమాలతో భారీ విజయాలను అందుకుంది. ఇక ఇప్పుడు అరడజను కు పైగా సినిమాల్లో నటిస్తుంది. కాగా ఇటీవల జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా రష్మిక గాయపడిన సంగతి తెలిసిందే. ఆమె కుడి పాదానికి గాయం కావడంతో సినిమా షఉటింగ్‌ల నుంచి చిన్న బ్రేక్ తీసుకుంది. కాలు నొప్పి ఉన్న కూడా ఛావ సినిమా ప్రమోషన్స్ లో చురుకుగా పాల్గొంది. వీల్ చైర్ లోనే ప్రమోషన్స్ కు వచ్చింది రష్మిక మందన్న. ప్రస్తుతం రష్మిక ‘సికందర్’, ‘కుబేర’, ‘థమ్’ వంటి చిత్రాల షఉటింగ్‌లో ఉన్నాయి. సికిందర్ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. అలాగే మురగదాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న కుబేర సినిమాలోనూ రష్మిక హీరోయిన్ గా చేస్తుంది. వీటితో పాటు తమిళ్ సినిమాలు , తెలుగులోనూ ఒకటి రెండు సినిమాలకు సైన్ చేసింది రష్మిక.

## దర్శకుడు మెహర్ రమేష్ ఇంట్లో విషాదం..

- సంతాపం తెలిపిన పవన్ కల్యాణ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ దర్శకుడు మెహర్ రమేష్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. అతడి సోదరి మాదాసు సత్యవతి హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచింది. దీంతో టాలీవుడ్ ప్రముఖులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా సత్యవతి మృతిపట్ల తన సంతాపాన్ని తెలియజేశారు. సత్యవతి మరణ వార్త తనను ఎంతగానో కలచివేసిందని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. “దర్శకుడు మెహర్ రమేశ్ సోదరి శ్రీమతి మాదాసు సత్యవతి గారు ఈరోజు హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారని తెలిసి ఎంతో బాధపడ్డాను. శ్రీమతి సత్యవతి గారి ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి కోరుకుంటున్నాను. వారి కుటుంబం విజయవాడలోని మాచవరం ప్రాంతంలో నివసించేది. చదువుకునే రోజుల్లో వేసవి సెలవులు వచ్చినప్పుడు వారి ఇంటికి వెళ్లేవాళ్లం. రమేష్, సత్యవతి గారు మరియు కుటుంబంలోని ఇతర సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా సమయం గడిపిన జ్ఞాపకాలు ఉన్నాయి. శ్రీమతి సత్యవతి గారి కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను” అని పేర్కొన్నారు.

## ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్‌పై వార్నర్ ఆసక్తికర పోస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉప్పల్ వేదికగా గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్ జీ) తలపడనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఆసక్తికర పోస్ట్ చేశారు. “ఈరోజు రాత్రి సన్‌రైజర్స్ 300 పరుగులు చేయగలదా? ఈ మ్యాచ్ చేసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. అభిషేక్ శర్మ 100 పరుగులు, ట్రావిస్ హెడ్ 20 బంతుల్లో 50 పరుగులు చేస్తారని నా అంచనా అంటూ వార్నర్ రాసుకొచ్చాడు. కాగా, గతంలో వార్నర్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఒక ఐపీఎల్ టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే.




## మమ్ముట్టి బజూక ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటిస్తోన్న తాజా చిత్రం బజూక. డినో డెన్నిస్ దర్శకత్వంలో ఫుల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీ థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌లో మమ్ముట్టి యాక్షన్ సీన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్, టామ్ చాకో కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే అదే రోజున అజిత్ కుమార్ గుడ్ బ్యాడ్ అగ్లీ సైతం బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.